సాక్షి తిరుపతి

ఆదివారం । 20 । ఏప్రిల్ । 2025



రంగులేస్తే ఏమొస్తుంది..

తుడా బెంచీలకు పసుపు రంగులేస్తే ఏమొస్తుంది.. సమస్యలు పరిష్కరించండి సారూ అంటూ ఉప్పరపల్లి వాసులు అడ్డుకున్నారు. - 4లో



బీడు భూములకు పరిహారం ఇవ్వలేం

గూడూరు తీర ప్రాంతమైన తమ్మినపట్నం పరిధిలోని బీడు భూములకు పరిహారం ఇవ్వలేమని కలెక్టర్ తెలిపారు. - 4లో



మట్కా నిర్వాహకుల అరెస్ట్

రూ.10కి రూ.800 అంటూ పేదలను మభ్యపెడుతున్న మట్కా నిర్వాహకులను పోలీసులు అరెస్ట్ చేశారు. - 4లో

న్యూస్‌రీల్

22న ఎస్వీయూలో జాబ్ మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఈనెల 22న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టీ.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో సుమారు 15 ఎమ్ఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9533889902, 7989810194 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



బాలాయపల్లి (సైదాపురం): గూడ్స్ రైలు పట్టాలు తప్పిన ఘటన బాలాయపల్లి మండలం, వెందోడు రైల్వేస్టేషన్ సమీపంలోని పిగిలాం కొత్తపాళెం వద్ద శనివారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు... వెందోడు పరిసర ప్రాంతాలకు చెందిన గేదెలు రైలు పట్టాలపై అడ్డంగా ఉన్నాయి. ఈ క్రమంలో గూడ్స్‌రైలు వాటిని ఢీకొట్టి.. అదుపుతప్పింది. ప్రమాదంలో గేదెలు మృతి చెందాయి. రైల్వే అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని గూడ్స్ రైలును పట్టాలు ఎక్కించే ప్రయత్నాలు చేశారు. సుమాగు 3 గంటలపాటు శ్రమించి రాకపోకలను పునరుద్ధరించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ టీబీసీ వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 58,519 మంది స్వామిని దర్శించుకున్నారు. 30,360 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.27 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.



రుచికి, పోషకాలకు మామిడి పెట్టింది పేరు. అందుకే ఇది పండ్లల్లో రారాజుగా గుర్తింపు తెచ్చుకుంది. కానీ ఏటా మామిడి వినియోగం తగ్గిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఎనర్జీ డ్రింక్స్, కూల్ డ్రింక్స్ మోజులో పడి యువత మామిడి రుచిని ఆస్వాదించలేకవడం ఒక విధంగా అవగాహనా రాహిత్యమేనని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. కళాశాలలు, పాఠశాలల స్థాయి నుంచే మామిడి వినియోగంపై అవగాహన పెంచాలని సూచిస్తున్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



మధుర ఫలం.. పోషకాలు ఘనం!

సమాచారం

మామిడి సాగు	గుజ్జు పరిశ్రమలు
1.5 లక్షల ఎకరాలు	47
ఏటా దిగుబడి	**రైతుల సంఖ్య**
5,47,320 టన్నులు	80 వేల మంది



మామిడిని ట్రేలకు ఎత్తుతున్న వ్యాపారులు

- జిల్లాలో విస్తారంగా మామిడి సాగు
- యూరప్‌లో యుద్ధాల కారణంగా అమ్ముడుపోని గుజ్జు
- ఆపసోపాలు పడుతున్న అన్నదాతలు
- స్థానికంగానే వినియోగం పెంచాలంటున్న వైద్య నిపుణులు



మామిడిని గ్రేడింగ్ చేస్తున్న సిబ్బంది

కాణిపాకం: మామిడి సాగు సంక్షోభంలో చిక్కుకుపోయింది. మామిడి గుజ్జుకు డిమాండ్ పడిపోయింది. పరిశ్రమల్లో నిల్వలు పేరుకుపోయాయి. గత ఏడాది వివిధ ఫ్యాక్టరీలు 2.75 లక్షల టన్నుల మామిడి గుజ్జును తయారు చేసి నిల్వ చేశాయి. ఈ గుజ్జు అత్యధికంగా యూరఫ్ దేశాలకు ఎగుమతి చేయాల్సి ఉంది. కానీ అక్కడ యుద్ధాల కారణంగా గతేడాది నుంచి గుజ్జు ఎగుమతులు స్తంభించాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 40 శాతం మేర గుజ్జు ఎగుమతి చేసినట్టు అధికారులు చెబుతున్నారు. మామిడి గుజ్జు కిలో రూ.60 నుంచి రూ.65 వరకు అమ్ముడు పోవాల్సి ఉండగా ప్రస్తుతం రూ.36 పలుకుతోంది. దీంతో ఏంచేయాలో తెలియక రైతులు.. పరిశ్రమల నిర్వాహకులు తలలు పట్టుకుంటున్నారు. ఈ క్రమంలో మామిడిలో అధిక పోషకాలు ఉన్నాయని, దీని వినియోగం పెరిగితే అటు రైతుకు.. ఇటు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

కూల్‌డ్రింక్స్‌తో ప్రమాదం

కూల్‌డ్రింక్స్ వినియోగం అమాంతం పెరిగిపోతోంది. చిన్న పాటి ఫంక్షన్ నుంచి పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల వరకు భారీ స్థాయిలో కూల్‌డ్రింక్స్ వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఎండలు మండిపోతున్న నేపథ్యంలో కూల్‌డ్రింక్స్ అమ్మకాలు జోరందుకున్నాయి. ఇదే అదునుగా పెద్దపెద్ద మాల్స్‌లో కూల్ డ్రింక్స్‌ను ఆఫర్ల పేరుతో అమ్మేస్తున్నాయి. తక్కువ ధరకు వస్తుందని చాలా మంది కూల్‌డ్రింక్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఇవి తాగడం వల్ల అజీర్ణం, వాంతులు, అధిక బరువు, డయాబెటిక్, ఫ్యాటీ లివర్, గుండె, కీళ్ల సమస్యలు, పంటి సమస్యలతో పాటు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మామిడితో ఉపయోగాలెన్నో

మామిడి పండ్లు, జ్యూస్‌లో పొటాషియం, మెగ్నీషయం అధికంగా ఉంటుంది. ఇవి రక్తపోటు సమస్యను నివారిస్తాయి. విటమిన్-సీ, ఫైబర్ శరీరంలోని హానిచేసే కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. పంటినొప్పి, చిగుళ్ల సమస్యలను, చిగుళ్ల నుంచి రక్తం కారడం లాంటి సమస్యలను దూరం చేస్తాయి. నోటిలోని బ్యాక్టీరియాను నాశనం చేస్తాయి. దంతాలు శుభ్రపడుతాయి. పంటిపై ఎనామిల్ కూడా దృఢంగా ఉంటుంది. మామిడి మంచి జీర్ణకారి. సహజమైన బరువు పెంచేందుకు దోహదం చేస్తోంది. మామిడి రసంలో ఉండే విటమిన్లు, ఖనిజాలు గుండె జబ్బు రాకుండా కాపాడుతాయి. వృద్ధాప్య సమస్యలను తగ్గిస్తుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు దోహదం చేస్తుంది. మెదడును ఆరోగ్యంగా ఉంచుతుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది.

ఎనర్జీ డ్రింక్‌ల మోజులో పడొద్దు



యువత ఎక్కువగా ఎనర్జీ డ్రింక్‌ల మోజులో పడుతోంది. కిక్ అంటూ వెంటపడుతున్నారు. అయితే దాని వల్ల వచ్చే ప్రమాదాలను గుర్తించలేకపోతున్నారు. కాలేజీలు, పాఠశాలల్లో పండ్ల రసాల వినియోగంపై అవగాహన పెంచాలి. ఎనర్జీ డ్రింక్స్‌లు తాగితే వచ్చే అనర్థాలను వివరించాలి.

–గోవర్ధన్‌బాబి, మామిడి పండ్ల గుజ్జు పరిశ్రమలశాఖ జిల్లా అధ్యక్షుడు, చిత్తూరు

మామిడి ఆరోగ్యానికి మంచిది



మామిడి రసం, పండ్లల్లో విటమిన్లు, మినరల్స్ అధికంగా ఉంటాయి. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచే బీట కెరాటిన్ అనేది సమృద్ధిగా ఉంటుంది. ఫైబర్ కావాల్సినంత ఉంటుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. ఎనర్జీ పెంచుతుంది. బరువు తక్కువగా ఉన్న పిల్లలు ఎక్కువగా తీసుకోవచ్చు. కంటి చూపునకు మేలు చేసే గుణాలు మ్యాంగోలో అధికం.

–సునీతాదేవి, చీఫ్ డైటీషియన్, స్విమ్స్, తిరుపతి



సమంతను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

ముక్కంటి సేవలో సినీనటి సమంత

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం ప్రముఖ సినీ నటి సమంత దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆమెను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. తదనంతరం ఆమె ఆలయం ఎదుట విలేకరులతో మాట్లాడారు. తాను నిర్మాతగా మారి తీసిన శుభం సినిమా విజయవంతం కావాలని స్వామి, అమ్మవార్లను ప్రార్థించినట్టు తెలిపారు.

సంస్కృతం..గర్వకారణం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ, వీసీ, అతిథులు

తిరుపతి సిటీ: సంస్కృత భాష దేశానికి గర్వకారణమని ఎస్పీ విష్ణువర్ధన్‌రాజు కొనియాడారు. జాతీయ సంస్కృత వర్సిటీ, సంస్కృత భారతి సంయుక్త ఆధ్వర్యంలో వర్సిటీలో రెండు రోజుల పాటు జరిగే స్ఫూర్తి సంఘం కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రాధాన్యం కలిగిన సంస్కృత భాషను సమాజంలోని అన్నివర్గాల వారికి అందించే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం సంస్కృత భారతి అఖిల భారతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ గోపబంధు మిశ్రా మాట్లాడారు. దేశంలో ప్రతి ఒక్కరికీ సంస్కృతాన్ని చేర్చాలనే లక్ష్యంతో సంస్కృత భారతి పనిచేస్తోందన్నారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, అఖిల భారతీయ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ బట్, డాక్టర్ ఎంజీ నందన్‌రావు, డాక్టర్ ఎస్ఎల్ సీతారామశర్మ పాల్గొన్నారు.

పెరగదేమి రొయ్యో!



- అమెరికా సుంకాలు వెనక్కి తీసుకున్నా పెరగని రొయ్య ధరలు
- రోజుకు రూ.5 నుంచి రూ.10 వరకు తగ్గింపు
- కూటమి ప్రభుత్వంలో భారంగా ఆక్వా సాగు
- జిల్లాలో సగానికిపైగా పడిపోయిన సాగు విస్తీర్ణం



ఖాళీగా రొయ్యల సాగు గుంతలు

...ల్లకూరు: రొయ్య ధరలు రోజురోజుకీ పతనమవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల అమెరికా సుంకాల పేరుతో రొయ్య ధరలు తగ్గించిన దళారులు.. ఇప్పుడు సుంకాలు వెనక్కి తీసుకున్నా రొయ్య ధరలు పెరగకపోవడం విమర్శలకు తావిస్తోంది. దీనికితోడు విద్యుత్ బిల్లులు, మేత ఖర్చు పెరిగిపోవడం, దళారులు కుమ్మక్కై ధరలను శాసిస్తుండడం అన్నదాతకు శాపంగా మారింది. సాగు విస్తీర్ణం సైతం సగానికి పైగా పడిపోయింది.

అమెరికా సుంకాల పేరుతో తగ్గిన ధరలు

ఇటీవల అమెరికా రొయ్యల ఎగుమతులపై సుంకాలు విధించింది. దీంతో ఒక్కసారిగా రొయ్య ధరలు పతనమయ్యాయి. ఆ తర్వాత అమెరికా వెనక్కి తగ్గడంతో యథావిధిగా ధరలు వస్తాయని ఆక్వా రైతులు ఆశించారు. కానీ ఇక్కడ ఉన్న దళారులు దీనిని ఆసరాగా తీసుకుని రోజుకు రూ.5 నుంచి రూ.10 వరకు తగ్గిచేస్తున్నారు. బయట నుంచి కొనుగోలుదారులు రాకుండా ఫీడ్ షాపుల యజమానుల నుంచి ఒత్తిడి తెస్తున్నారు. తమకే రొయ్యలు విక్రయించాలని పట్టుబడుతున్నారు. దీంతో సాగుదారులు నష్టాలను చవిచూస్తున్నారు.

జిల్లాలో సగానికి పడిపోయిన రొయ్యల సాగు

తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గంలో మాత్రమే రొయ్యల సాగు చేపడుతున్నారు. చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో ఎక్కువగా రొయ్యలు సాగుచేస్తున్నారు. చిల్లకూరు మండలంలో కండలేరు క్రీక్ వెంబడి టైగర్, వెనామీ రొయ్యలు సాగుచేస్తున్నారు. ధరలు పతనమవుతుండడంతో రైతులు ఈ ఏడాది సాగును సగానికి తగ్గించేశారు.

భారంగా విద్యుత్ చార్జీలు

ఆక్వా జోన్‌లు ఏర్పాటు చేసి గత ప్రభుత్వం విద్యుత్ రాయితీలు ఇచ్చేలా ప్రోత్సహించింది. దీనిని కొనసాగించేలా కూటమి ప్రభుత్వం ఇంకా విద్యుత్ చార్జీలు తగ్గించేలా ఆదేశాలిచ్చింది. అయితే విద్యుత్ శాఖ మాత్రం గతంలో రాయితీ ఇచ్చిన సొమ్మును తిరిగి కట్టించుకునేలా వ్యవహరిస్తోంది. టారిఫ్‌ల పేరుతో ప్రతి బిల్లులో ట్రూ ఆఫ్ చార్జీలను వసూలు చేస్తోంది.

జిల్లా సమాచారం

మండలం	గత ఏడాది ఆక్వా సాగు (ఎకరాలలో)	ప్రస్తుతం ఆక్వా సాగు
చిల్లకూరు	4,850	2,444
కోట	2,875	1,230
వాకాడు	1,280	280
చిట్టమూరు	3,200	2,941

వెనామీ ధరలు

కౌంట్	గత వారం	ప్రస్తుతం
100 కౌంట్	రూ.245	రూ.225
90 కౌంట్	రూ.240	రూ.230
80 కౌంట్	రూ.255	రూ.240
70 కౌంట్	రూ.280	రూ.270
60 కౌంట్	రూ.300	రూ.285
50 కౌంట్	రూ.320	రూ.300

సాగు కష్టంగా ఉంది



గతంలో ఆక్వా సాగుకు ప్రోత్సాహం ఉండేది. నేడు రాయితీలు లేవు. ధరలు కూడా నిలకడగా లేక పోవడంతో సాగు చేయలేక పోతున్నాం. ఒక వైపు వైరస్‌లు, మరో వైపు మేత ధరలు అధికం కావడం, విద్యుత్ చార్జీల భారంతో నలిగిపోతున్నాం. అమెరికా సుంకాల పేరుతో ధరలు తగ్గించేస్తున్నారు.

– మదన్‌కుమార్‌రెడ్డి, తిక్కవరం, ఆక్వా సాగుదారుడు, చిల్లకూరు మండలం

సాగు ఆపేశా



ఆక్వా సాగు చేసుకుని ఆదాయం పొందుదామని చిట్టమూరు మండలం, పిట్టువాని పల్లి వద్ద ఏడు ఎకరాలు లీజుకు తీసుకున్నా. గత ఏడాది పెట్టుబడులు మాత్రమే వచ్చాయి. ఈ ఏడాది కూడా సాగు చేద్దామంటే ధరలు నిలకడలేవు. వైరస్ తెగుళ్లు ఎక్కువ. చేసేది లేక సాగుకు పూర్తిగా దూరమైనా. చిన్న పాటి వ్యాపారం చేసుకుంటున్నా.

– పాకం చెంగయ్య, కల్లూరుపల్లిపాళెం

క్లుప్తంగా

గంగ కాలువలో మహిళ మృతదేహం



దక్కిలి: కండలేరు–పూండి కాలువలో శనివారం ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఎస్‌ఐ శివశంకర్ కథనం.. డక్కిలి సమీపంలోని తెలుగుగంగ కాలువలో ఓ మహిళ మృతదేహం వెళ్తున్నట్టు స్థానికులు సమాచారం అందించారన్నారు. అయితే ఆ మృతదేహం ఎక్కడి నుంచి వచ్చిందో తెలియడంలేదన్నారు. మృతదేహం వెంకటగిరి లేదా బాలాయపల్లి మండలం, ఊట్లపల్లి గేటు దగ్గర లభ్యం కావొచ్చని తెలిపారు. ఈ మేరకు గాలింపు చర్యలు చేపట్టినట్టు వెల్లడించారు.

లీగల్ సెల్ కమిటీ చైర్మన్‌గా సునీల్ కుమార్



తిరుపతి లీగల్ : ఇండియన్ హ్యూమన్ రైట్స్, యాంటీ కరప్షన్ సెల్ అనుబంధ తిరుపతి జిల్లా లీగల్ సెల్ కమిటీ చైర్మన్‌గా న్యాయవాది ఎస్ఎస్ సునీల్ కుమార్ ఎంపికయ్యారు. తిరుపతిలోని ఆ సంస్థ కార్యాలయంలో శనివారం కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ సెల్ చైర్మన్లను ఎంపిక చేశారు. తిరుపతి జిల్లా లీగల్ సెల్ చైర్మన్‌గా ఎస్ఎస్ సునీల్ కుమార్, మహిళా లీగల్ సెల్ చైర్మన్‌గా మహిళా న్యాయవాది జి.రమణి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఇండియన్ హ్యూమన్ రైట్స్, యాంటీ కరప్షన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కాణిపాకం మురళీ మాట్లాడుతూ ప్రజల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడానికి తమ సంస్థ న్యాయ సలహాదారులు కృషి చేస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో కమిటీ జనరల్ సెక్రటరీ ఎం.హరిబాబు, జిల్లా అధ్యక్షుడు మునిరెడ్డి, నగర అధ్యక్షుడు ఎస్.దేవిప్రసాద్, ఉపాధ్యక్షుడు శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రంగులేస్తే ఏమొస్తుంది..

అభివృద్ధి చేయండి సారూ!

- తుడా బెంచీలకు పసుపు రంగులొద్దని అడ్డగింపు
- అభివృద్ధి పనులు చేయాలన్న ఉప్పరపల్లి వాసులు
- అదే బెంచీలకు బులుగు రంగు కొట్టి జై భీమ్ అని రాసుకున్న గ్రామస్తులు
- తోక ముడిచిన టీడీపీ అల్లరిమూకలు
- 10 మందిపై అక్రమ కేసులకు యత్నం



గ్రామంలో ఏర్పాటు చేసిన తుడా బెంచీలు

పాకాల: 'సారూ.. బెంచీలకు ఇష్టమొచ్చిన రంగులద్దితే ఏమొస్తుంది.. గ్రామంలో సవాలక్ష సమస్యలున్నాయి. ముందు వాటికి పరిష్కారం చూపండి' అంటూ మండలంలోని ఉప్పరపల్లి వాసులు అధికారులకు ఎదురుతిరిగారు. రెండు రోజుల క్రితం గ్రామ కార్యదర్శి తుడా నిధులో వేసిన బెంచీలకు పసుపు రంగులు కొట్టేందుకు గ్రామానికి వెళ్లారు. రంగులద్దేటందుకు ప్రయత్నించగా.. గ్రామస్తులు మూకుమ్మడిగా అడ్డుకున్నారు. గ్రామంలో దారి సమస్య ఉందని, మురికి కాలవులు శుభ్రం చేయలేదని, పారిశుద్ధ్య అధ్వాన్నంగా ఉందని సదరు పంచాయతీ కార్యదర్శికి సమస్యలు ఏకరువు పెట్టారు. అభివృద్ధి పనులు చేయాలని సూచించారు. దీంతో చేసేది లేక అక్కడి నుంచి పంచాయతీ కార్యదర్శి మొహం చాటేశారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు ఎలాగైన ఆ గ్రామంలో బెంచీలకు పసుపు రంగులు వేయాలని ప్రణాళిక రచించారు. దీన్ని పసిగట్టిన గ్రామస్తులు తామే సొంతంగా బులుగు రంగు తెచ్చుకుని బెంచీలకు అద్ది.. జై భీమ్ అని రాసి తమ విజ్ఞతను చాటుకున్నారు.

అక్రమ కేసులకు యత్నం

బెంచీలను తాకే ధైర్యం లేక అధికార మదంతో కొందరు టీడీపీ అల్లరిమూకలు రెచ్చిపోయాయి. పోలీసులను అడ్డుపెట్టుకుని చెలరేగిపోయాయి. గ్రామానికి చెందిన పది మంది యువకుల పేర్లు రాసుకుని 'మీపై అక్రమ కేసులు బనాయిస్తాం' అని బెదిరించినట్లు సమాచారం. అసలు ఈ విషయంలో పోలీసులు ఎందుకు అత్యుత్సాహం చూపుతున్నారో అర్థం కాని పరిస్థితి. స్థానిక గ్రామానికి చెందిన యువతను పోలీస్‌స్టేషన్‌కి పిలిపించి విచారించినట్లు సమాచారం.

బలవంతపు భూసేకరణ వద్దు



సత్యవేడు తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

సత్యవేడు: బలవంతపు భూసేకరణ వద్దని, ఏపీఐఐసీ భూసేకరణకు అధికారులు వస్తే అడ్డుకొని తీరుతామని మండలంలోని ఇరుగుళం, కొల్లడం, పెద్ద ఈటిపాకం, రాళ్లకుప్పం గ్రామాల రైతులు స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం సత్యవేడు తహసీల్దారు రాజశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రయివేటు సంస్థ వ్యాపారం కోసం తమ భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేమని తేల్చిచెప్పారు. 2007లో సత్యవేడు మండలంలో ఏర్పాటు చేసిన శ్రీసిటీకి నాలుగు గ్రామాల పరిధిలోని రైతులు 1000 ఎకరాలకుపైగా భూమిచ్చారని, అప్పుడు సేకరించిన భూమిలో ఇంకా 200ల ఎకరాలకు పైగా ఖాళీగా ఉందన్నారు. ఆ స్థలంలో ప్రస్తుతం ఎల్‌జీ కంపెనీకి భూమిని ఇచ్చుకోవాలని సూచించారు. జీఓఎంఎస్ నెం.39ని రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కే.విజయశంఖర్ రెడ్డి, కేవీ.నిరంజన్‌రెడ్డి, కే.సుశీల్‌కుమార్ రెడ్డి, శ్రీరామచంద్రారెడ్డి, జయశంకర్, కే.ప్రతాప్ రెడ్డి, బీబీఎస్ రెడ్డి, రఘునాథరెడ్డి, రవిరెడ్డి, కే.మురళీనాయుడు, కే.బాలాజీ, రామ్మూర్తిశెట్టి, దయాకర్ రెడ్డి, రజనీకాంత్, కేవీ. రామన్, సరవనన్, పీ.శ్రీనయ్య, జీ.మురళి పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం



మున్సిపల్ కార్మికులను సత్కరిస్తున్న కలెక్టర్, సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే

గూడూరు రూరల్: జిల్లాలో ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో శనివారం గూడూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణాన్ని సుందరీకరణగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. అర్ధంతరంగా ఆగిపోయిన ఆర్ఓబీని రెండేళ్లలో పూర్తిచేస్తామన్నారు. గూడూరు చెరువు మీద ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. తెలుగు గంగ నీటిని అన్ని చెరువులకు అందించేలా మంత్రితో చర్చించి చర్యలు చేపడుతామన్నారు. అనంతరం టవర క్లాక్ వద్ద నుంచి ర్యాలీ ప్రారంభించారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సబ్ కలెక్టర రాఘవేంద్ర మీన, డీఎస్పీ గీతాకుమారి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎవరు తవ్వుకుంటున్నారో తెలియదు

కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో తెల్లరాయి, సిలికా, ఇసుక పుష్కలంగా దొరకడంతో నిధులు కూడా పుష్కలంగా ఉంటాయనుకుంటారని, అయితే ఈ ఖనిజ సందపను ఎవరు తవ్వుకుంటునారో మాత్రం తెలిదని చెప్పారు. నియోజకవర్గానికి నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్‌ను కోరారు.

మట్కా నిర్వాహకుల అరెస్ట్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఏవీ రమణ

వెంకటగిరి రూరల్: పట్టణంలో మట్కా నిర్వాహకులను స్థానిక ఎస్ఐ సుబ్బారావు ఆధ్వర్యంలో చాకచక్యంగా పట్టుకున్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను సీఐ ఏవీ రమణ వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ఈజీ మనీకి అలవాటు పడిన కొందరు మట్కాపై ఆశజూపి, అమాయక ప్రజలను టార్గెట్ చేస్తూ రూ.10 కటితే లాటరీ రూ.800 వస్తుందని మభ్యపెట్టి దోచుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో ఆటో డ్రైవర్లు, కూలీలు అధికంగా ఉన్నట్లు పేర్కొన్నారు. వెంకటగిరి ఎస్ఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పట్టణానికి చెందిన 8 మంది మట్కా నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.26,200 నగదు, 51 స్లిప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు.

ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లల్లో 25 శాతం ఉచిత సీట్లు

- 28 నుంచి మే 15 వరకు దరఖాస్తుకు గడువు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం 2025–26 విద్యా సంవత్సరంలో జిల్లాలోని ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో కేవీఎస్.కుమార్ తెలిపారు. అనాథ, హెచ్‌ఐవీ బాధిత, దివ్యాంగ పిల్లలకు 5 శాతం, ఎస్సీకి 10, ఎస్టీకి 4, బీసీ, మైనారిటీ, ఓసీలకు 6 శాతం రిజర్వేషన్ ఉంటుందని వెల్లడించారు. వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.2 లక్షలు, పట్టణాల్లో రూ.1.4 లక్షల లోపు ఉన్న వారు అర్హులని తెలిపారు. అర్హత గల తల్లిదండ్రులు ఈ నెల 26 నుంచి మే 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఐఐటీ, జేఈఈ మెయిన్స్‌లో శ్రీచైతన్య విజయ ఢంకా



జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థ ఏజీఎం, డీన్‌లు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఐఐటీ–జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు వివిధ కేటగిరిల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారని ఆ విద్యాసంస్థ ఏజీఎం బీవీ.ప్రసాద్ తెలిపారు. ఈ ఫలితాల్లో పీ.కృష్ణవంశీ 331వ ర్యాంకు, ఈ.జశ్వంతి 458, సీ.ద్వారక్ 723, ఎంజీ.సూర్య 818, బీఏ.రెడ్డి 1000, బీ.అన్విత్ 1,214, ఎం.మునికృష్ణ 1,329, సి.సహస్ర 1,742, కె.అభిరామ్ 1,885, కె.సతీష్ 1,968, ఓ.మోక్షిత్ 2,622, సి.వరుణ్‌తేజ 3,642, కె.మంజునాథమహర్షి 5,001, వి.నిఖిలేశ్వర్ రెడ్డి 5,268, ఎం.హర్షిణి 5,315, వి.హర్షిత బ్రెట్టి 5,361, యు.ఉజ్వల్ సాయిరెడ్డి 5,527వ ర్యాంకులు సాధించారని తెలిపారు. అలాగే వీరితో పాటు సుమారు 85మందికిపైగా విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించే అర్హత పొందారని తెలిపారు. అలాగే తమ విద్యార్థులు 450మందకిపైగా మే 18వ తేదీన ఎన్‌టీఏ నిర్వహించనున్న ఐఐటీ–జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించారని తెలిపారు. అనంతరం ప్రతిభకనబరిచిన విద్యార్థులను ఆ విద్యాసంస్థ డీన్‌లు కేఎల్‌జీ.ప్రసాద్, రామమోహనరావు, శ్రీనివాసరాజులు అభినందించారు.

బీడు భూములకు పరిహారం ఇవ్వలేం

చిల్లకూరు: బీడు భూములకు పరిహారం ఇవ్వలేమని కలెక్టర్ వెంకటేశ్వర్ తేల్చిచెప్పారు. గూడూరు పర్యటనలో భాగంగా ఆయన్ను కలసిన తమ్మినపట్నం గ్రామస్తులతో కలెక్టర్ మాట్లాడారు. తీర ప్రాంతంలోని తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేసే క్రిస్ సిటీ కోసం సేకరించిన భూముల పరిహార విషయమై ప్రస్తావించగా బీడు భూములకు పరిహారం ఇవ్వలేమని కలెక్టర్ స్పష్టం చేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులు మాట్లాడుతూ క్రిస్ సిటీ కోసం సేకరించిన భూముల్లో సుమారు 215 ఎకరాల వరకు బీడు భూములు ఉండగా వాటిలో 165 ఎకరాల వరకు తమ్మినపట్నం వారి అధీనంలో ఉండి గతంలో సాగులో ఉండే భూములేనని చెప్పారు. కోవిడ్ సమయం నుంచి వాటిని సాగు చేయక పోవడంతో అవి బీడు భూములుగా ఉడి పోయాయని చెప్పారు. వీటిని సాగు చేసుకుంటున్న వారందరికీ పరిహారం ఇవ్వాలని కలెక్టర్‌కు సూచించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. బీడు భూములకు పరిహారం ఇవ్వలేమని తేల్చిచెప్పారు. అనంతరం ఆయన క్రిస్ సిటీ ఏర్పాటు చేసే తీగపాళెం వద్దకు చేరుకుని అక్కడ అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గూడూరు సబ్ కలెక్టర రాఘవేంద్రమీన, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

హక్కుల సాధనే లక్ష్యం



మాట్లాడుతున్న ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్‌రావు

తిరుపతి కల్చరల్: బీసీల హక్కుల సాధనే లక్ష్యంగా జూన్ 6న తిరుపతిలో భారీ స్థాయిలో బీసీల ఆత్మీయ సభ నిర్వహించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. శనివారం తిరుపతిలోని ఓ ప్రయివేటు హోటల్‌లో బీసీ ముఖ్యనేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీల పట్ల పాలకులు అవలంభిస్తున్న వివక్షత, నిర్లక్ష్య వైఖరిపై చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు బీసీల పట్ల నిర్లక్ష్య వైఖరి చూపుతూ దగా చేస్తున్నాయని మండిపడ్డారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగరాజగౌడ్, దక్షిణాది రాష్ట్రాల బీసీ సంక్షేమ సంఘం నేత ఆల్మెన్‌రాజు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు క్రాంతికుమార్, నాయకులు నంజుండప్ప, రెడ్డెప్ప, జెల్లి మధుసూదన్, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బీ.స్రవంతి, జిల్లా అధ్యక్షురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీధర్స్ అకాడమీ విజయకేతనం



ఎం.మహేష్, ఎస్.వంశీకృష్ణారెడ్డి, టి.హరజిత్, నికిలేశ్వర్‌రెడ్డి, ఈ.మంజుశ్రీ, పి.మహమ్మద్ అబుతాలిబ్

తిరుపతి ఎడ్యుకేషన్ : ఐఐటీ–జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షా ఫలితాల్లో తిరుపతి ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని శ్రీధర్స్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్టు ఆ అకాడమీ చైర్మన్ మద్దినేని శ్రీధర్ తెలిపారు. ఈ ఫలితాల్లో వివిధ కేటగిరిల్లో ఎం.మహేష్ 298వ ర్యాంకు, ఎస్.వంశీ కృష్ణారెడ్డి 756(వీడబ్ల్యూ ఎస్‌లో ర్యాంక్-98), టి.హరజిత్ 1,477, నిఖిలేశ్వర్‌రెడ్డి 4,260, ఈ.మంజుశ్రీ 6,103, పి.మహమ్మద్ అబుతాలిబ్ 7,843, ఎస్.మహమ్మద్ ఇమ్రాన్ 8,240, డి.పోషిత 15,891వ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. వీరితో పాటు మెయిన్స్‌కు హాజరైన తమ విద్యార్థులు 108 మందిలో 42 మంది అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ఆయన అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో అదుర్స్



ఎం.భానుచరణ్‌రెడ్డి, 158వ ర్యాంకు; డి.మణిదీప్‌రెడ్డి, 274వ ర్యాంకు; కె.నిఖిల్, 386వ ర్యాంకు; బీవీ.ధనుష్, 466వ ర్యాంకు; జి.హిమేష్‌రాఘవచంద్ర, 502వ ర్యాంకు; ఎల్.కార్తిక్, 1072వ ర్యాంకు; కె.యశ్విత, 1535వ ర్యాంకు; పి.కృష్ణవంశీ, 331వ ర్యాంకు; ఈ.జశ్వంతి, 458వ ర్యాంకు; సి.ద్వారక్, 723వ ర్యాంకు

తిరుపతి ఎడ్యుకేషన్ : జేఈఈ మెయిన్స్ రెండో విడత ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుపతి జిల్లా విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ స్కోరు సాధించి ప్రతిభ చాటారు. జిల్లాలోని వివిధ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించే విద్యార్థులు వివిధ కేటగిరిల్లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఈ ఫలితాల్లో ఓపెన్ కేటగిరిలో ఎం.భానుచరణ్‌రెడ్డి 99.993 పర్సంటైల్ స్కోరు సాధించి జాతీయ స్థాయిలో 158వ ర్యాంకు సాధించాడు. అలాగే డీ.మణిదీప్‌రెడ్డి 99.98 పర్సంటైల్ స్కోరుతో 274వ ర్యాంకు, పీ.కృష్ణవంశి 331, కే.నిఖిల్ 99.98 పర్సంటైల్ స్కోరుతో 386వ ర్యాంకు, ఈ.జశ్వంతి 458, బీవీ.ధనుష్ 99.97 పర్సంటైల్ స్కోరుతో 466 వర్యాంకు, జీ.హిమేష్‌రాఘవచంద్ర 99.97 పర్సంటైల్ స్కోరుతో 502వ ర్యాంకు, సీ.ద్వారక్ 723, ఎంజీ.సూర్య 818, బీఏ.రెడ్డి 1000, ఎల్.కార్తిక్ 99.93 పర్సంటైల్ స్కోరుతో 1,072వ ర్యాంకు సాధించారు. అలాగే ఓపెన్ కేటగిరి బాలికల విభాగంలో కే.యశ్విత 99.90 పర్సంటైల్ స్కోరుతో జాతీయ స్థాయిలో 1,535వ ర్యాంకు సాధించి గ్రేటర్ రాయలసీమలో మొదటి స్థానంలో నిలిచింది. వీరితో పాటు ఇంకా పలువురు విద్యార్థులు ఉత్తమ పర్సంటైల్ స్కోరు సాధించి ఐఐటీ–జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించారు.